అంతరాత్మ

"ఇందులో నీ సహాయంకూడా చాలా అవసరం" అన్నాడు, తమ్ముడివైపు ఆశగా చూస్తూ, రాఘవయ్య.

"అంటే?" అన్నాడు వెంకటరత్నం, అర్థంకాక.

" ఈ పదిహేనువేల రొఖ్ఖమూ, యీ బంగారు వెండి సామాన్లు, పత్రాలూ- అన్న పొయ్యేదాకా మనకు తెలియవు. ఇందులో మనం కాస్త తీసుకుంటే—?"

"ఆమాట అన్న అనలేదే?"

తమ్ముడి అమాయకత్వానికి నవ్వి, "అంటే ఇంత గోలెందుకూ? అనలేదు కనుకనే రెండో కంటికి కన్పించకుండా మనం పూర్తిచేద్దాం!" అన్నాడు.

వెంకటరత్నం చిన్నన్న మాటలకు ఆశ్చర్యపొయ్యాడు. అన్న చనిపోయిన కొన్ని గంటలకే అతని ఆస్తి వివరాలు తమకు తెలిసినై. అప్పుడే దానిలో కొంత భాగాన్ని భుక్తం చేసే దురభిప్రాయాలా ?

"ఇది అన్యాయం—"

"న్యాయమైన, కష్టార్జితమైన సంపాదన చేస్తే—ఒక మానవ జీవితంలో ఎవరైనా పదివేల రూపాయలు కూడబెట్టగలరా ? మనతో భాగాలుపడ్డ అన్నయ్య —ఇంత సంపాదన ఎల్లా చెయ్యగలిగాడో ఆలోచించు—"

ఒకళ్ల కష్టార్జితాన్నే గురిగా పెట్టుకుంటే మానవుల్లో ఇంతమంది భాగ్యవంతులు ఎలా తయారయ్యారో వెంకటరత్నానికి అర్థమవలేదు. ఐనా ఇది చాలా దుర్మార్గమైనపని

అని అతని అంతరాత్మ ఘోషిస్తూనే వుంది.

"ఏమంటావు?" అన్నాడు తమ్ముడివైపు చూస్తూ.

"ఒద్దు—"

"ఇంత అమాయకుడి వనుకోలా" అని స్వరం ఎక్కించి గంభీరంగా, "పిరికితనంలో ఇప్పుడేమీ చెయ్యలేకపోతే చేతులు కాలాక ఆకులు పట్టుకోవటమే అవుతుంది. పరువు మర్యాదలు గల మనను చాటుగానైనా ప్రశ్నించేవాళ్ళుండరు....పోనీ వెండీ, బంగారమూ, పత్రాలూ, అయితే ఎవరైనా అనుమాన పడతారు. అందరి చేతుల్లోనూ నలిగేందుకు హాకుక్కన్న కరెన్సీ నోట్లయితే ఏ ఇబ్బందీ ఉండదు. బాగా ఆలోచించుకో" అన్నాడు తెరిచివున్న ఇనప్పెట్టెలోకి వేలుపెట్టి చూపుతూ.

ఆ కరెన్సీనోట్ల కట్టల్ని చూసేప్పటికి పాపభీతిగల వెంకటరత్నం మనస్సుకూడా చలించింది. చిన్నన్న చెప్పిందాంట్లో నిజం లేకపోలేదు. భాగాలుపడ్డాక తన ఆస్తిలో చాలా భాగాన్ని, కోర్టులపాలూ, దురభ్యాసాలపాలూ చేశాడు. రేపు పిల్లలు పెద్దవాళ్ళయ్యాక, వాళ్ళకు రొఖ్ఖరూపంలో తనేం ముట్టచెప్పగలడు? ఇదేమంత ప్రమాదమని తను భయపడాలి? దొంగతనాన్ని పట్టుకోవటమంటూ లేకపోతే—ఎంతమంది దొంగలయ్యేందుకు ఉవ్విళ్ళూరుతారో?

చిన్నన్న చెప్పినమాటలు ఎల్లా చెవికెక్కి ఇంజక్షనులాగ పనిచేసెయ్యో కాని, వెంకటరత్నం అర్థాంగీకారంగా తల ఊపాడు. రాఘవయ్య అమితోత్సాహంతో నవ్వి, "ఐతే ఎంత తీద్దా మంటావు?" అన్నాడు.

"నీ ఇష్టం"

"ఆరువేలు—ఏం?"

"కనుక్కుంటారేమో?"

"ఇంకా ఆ భ్రమ నీకు దేనికి? నీ నోటివెంటా, 'నానోటి వెంటా బైటికిరావాల్సిందే కాని—ఇంకోవిధంగా యీసంగతి పరాయివాడికి తెలియటం కలలోనివార్త."

రాఘవయ్య మూడువేల రూపాయలనోట్లను తన చేతికి అందిచ్చాడు; వాటిని ఎట్లాతీసుకొని జేబులోపెట్టుకున్నాడో ఆతనికి తెలియదు. డబ్బు అందరికీ గొప్ప సమస్యగా ఉన్నప్పుడు దాన్ని హృదయపూర్వకంగా నిరాకరించగలవాడెవడు?

2

చిన్నన్న కొడుకు పోయిన సంగతి విన్న క్షణానే వెంకటరత్నం మంచానపడ్డాడు. డాక్టర్లు ఒకళ్ళకు ఇద్దరు మారారు. కాని వ్యాధి ఫలానా అనికూడా గుర్తించలేకపోయారు.

ఆ పాపిష్టి డబ్బును తెచ్చుకున్నప్పటినుంచీ అసలు తనకు అరిష్టం సంభవించింది. పూటకు రెండుశేర్ల పాలు ఇచ్చే ఆవు కాస్తా చావటమేమిటి? తనాబీలాగు తిరిగే తను ఏరోగమూ లేకుండానే మంచమెక్కటమేమిటి? ఆ పాపిష్టి సొమ్ముతో చిన్నన్న కుర్రాడికి గొలుసు చేయిస్తూండగానే—దాన్ని మెడలో వేసుకు తిరిగే ప్రాప్తి లేకుండానే వాడు టపాకాయలాగు చిన్నబిడ్డనొప్పితో ఎగిరిపోవటమేమిటి? ఆదొంగ సొమ్ము పాపఫలితం కాకపోతే దీన్ని ఇంకోవిధంగా తనెల్లా

సముద్ధరించుకోగలుగుతాడు ?

లంకణాలు ఒకటికి పది అయ్యాయి. ఆ అర్థరాత్రి ఇనపపెట్టె ముందు తనూ చిన్నన్నా కూర్చొని చేసిన వెధవపని తల్చుకున్నప్పుడల్లా వెంకటరత్నం భయంతో ఒణికేవాడు. ఆ బలహీనతలో యీ బాధ మరీ దుర్భరమయింది. వాళ్ళుపోసే రంగునీళ్ళను తాగుతూ ఎలాగో బతికి వున్నాడు కాని — లేకుంటే యీపాటికి తను పెద్దన్నను కలుసుకునేవాడే !

మరి రెండు సూర్యోదయాల తరువాత తన మంచం చుట్టూ జేరిన జనం తను పిచ్చిమాటలు మాట్లాడుతూన్నట్టుగా సంభాషించటం తనకు తెలుసు. కాని అదంతా స్వప్నంలో జరిగే ఘట్టంలాగు స్ఫురించింది.

ఆ రాత్రి పీడ కలలతో అతని మనశ్శాంతి మరీ చెడిపోయింది. కలలో వదినగారు దీనంగా ఏడుస్తూ ఆరుగురు పిల్లలతో సహా ప్రత్యక్షమైంది. ఆ పిల్లలు — తన పిల్లలలాటివాళ్ళే ! వాళ్ళకు తండ్రిలేని లోటులో కూడా రెక్కలు వచ్చేదాకా జీవనం గడవాలి; మొగపిల్లలకు చదువులు కావాలి. ఆ ముగ్గురు ఆడపిల్లలకూ పెళ్ళిళ్లు కావాలి. ఆ సంసారాన్ని ఆదుకి, నిస్సహాయ, ఆ వదినగారు శక్తివున్నా లేకున్నా యీదుకు రావాలి ! కాని ఆమెను ఆసముద్రంలో ముంచేందుకు తను ప్రయత్నించాడేమో ?

అన్నగారుకూడా కలలో కన్పించాడు. కలలకు చచ్చినవాళ్ళకూ, బతికినవాళ్ళకూ భేదం ఉండదు కాబోలు ! అన్న అన్నాడు: "నా మరణశయ్యమీద నా సంసారాన్ని మీ ఇద్దరినీ నమ్మి మీమీద వదిలినందుకు ఇంత ద్రోహమా ?

రక్తస్పర్శనైనా తలచకుండా ఇదేనా మీరు నాకు చూపే కృతజ్ఞత...?"

పెద్ద కేకతో వెంకటరత్నం లేచి కూర్చున్నాడు. అతని భార్యవచ్చి, "ఏమిటి?" అని అడిగింది. అతను భయంలో ఏమీ చెప్పలేక పోయ్యాడు; చెప్పదల్చుకోలేదు కూడా.

ఆ మిగతా రాత్రి నిద్రాదేవి అతనితో విరోధం పూనింది. అన్న బిడ్డల గొంతులు కోసి ఆరక్తంలో తను ఆనందిస్తూ న్నట్టు స్ఫురించి అతని ఆత్మ ఘోషించసాగింది. తన సంసార పోషణకు సరిపొయ్యే ఆదాయం తనకు ఉండగా తన కెందుకు ఆ అనాథల ఉసురు? అసలు ఆపాడుపనికే యీ శిక్షేమో?

ఎల్లాగైనా యీరకం ఆలోచనల్ని తప్పిద్దామని గట్టిగా కళ్లుమూసుకున్నాడు. కన్ను మూశాడో లేదో చచ్చిన అన్న రూపం ప్రత్యక్షమైంది. మేలుకుంటే పశ్చాత్తాపంలో కుమ లాల్సిన బాధ! కన్ను ముయ్యటానికి కూడా భయమే! తెల్లారిందో లేదో తెలియదు; అవతలిగదిలో వదినగారి కంఠం వినవస్తోంది.

"ఆయన పోయిన పదిహేను రోజులకే ఆబిడ్డ చనిపోవ టం, మరిదికి వెంటనే జ్వరం రావటం... మన ఖర్మం కాకపోతే మరేమిటి? మన వంశానికి ఎంత దుర్దశ పట్టింది?" ఆ తరువాత మాటలు లేవు; వదినగారు సన్నని గొంతుతో కుమిలినట్టు ఏడ్వటాన్ని తన చెవులు గుర్తించినై.

ఇంత దయతో మాట్లాడటాన్ని అతను భరించలేక పోయాడు. తనలాంటి పాపికి ఎంత ఆదరణ! ఎన్ని లక్షల రూపాయలిచ్చి తను అలాంటి మాటల్ని వినగలడు? వదిన—చిన్న

తనంలో తను రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చినందుకు తండ్రి చేత చివాట్లుతిని, ఆకోపంతో అన్నం తినకుండా బిగతీసుకు పడుకుంటే—ఆ అర్ధరాత్రివేళ యీ వదినే తనకోసం లేచి వచ్చి బతిమాలి, అనేక విధాల నచ్చచెప్పి, స్వయంగా తన చేత అన్నం తినిపించటాన్ని తనెట్లా మరిచిపోగలడు? ఆదేవత మీద నేనా తను కత్తికట్టింది? ఆత్మా, హృదయమూ, ఉన్న తను యీ క్రౌర్యాన్ని పూనబట్టే... చిన్నన్న శరీరంపైన పడ్డ మృత్యుదేవత శీతలహస్తం తనకుకూడా సమీపంలో ఉందేమో? పశ్చాత్తాపపడి, ఆడబ్బును ఇచ్చేస్తే తనకేమైనా ముక్తి వుంటుందేమో?

కళ్లు మూశాడు—ఆ అన్న !

భార్యను పేరుపెట్టి పిలిచాడు. వదినా, భార్యా పరుగెత్తుకుంటూ వచ్చారు; వదినగారి కళ్లు చెమ్మగిలి ఉన్నయ్. భార్యముఖం వాడి వుంది. ఎందుకు తనింత బాధపడుతున్నాడు?

తనకు తెలియకుండానే ఆమంచంలోంచి వదినగారికి నమస్కరించాడు. ఆమె స్తబ్ధమై చూస్తోంది.

భార్యతో "ఆపెట్టెలోవి మూడువేల రూపాయిలు వదినకివ్వు" అన్నాడు ఒణుకుతూన్న కంఠంతో.

"ఏమిటి—కలవరిస్తున్నారా?" అంటోంది వదిన.

"లేదు—ఏమిటో నేను చెప్పలేను; తీసుకోండి—"

"నాకు అర్థమవటం లేదు—"

"అర్థమైతే యీ దీనుడిమీద నీ దయావాహిని ప్రవహించదు వదినా !" అని తలగడాలో తలదాచుకొని వెక్కి-

వెక్కి ఏడ్వ నారంభించాడు— చిన్న పిల్లాడిలాగు! తోడి కోడళ్లిద్దరూ ఒకరి ముఖాల్లోకరు చూసుకుంటూ నిలబడ్డారు.

కొంతసేపటికి తన స్థితిని గ్రహించుకొన్నాడు. గొంతుక తడి ఆరిపోయింది. మాట్లాడటమే కష్టమనిపించింది.

"ఇమ్మని చెప్పింది నీకే!" అన్నాడు ఎల్లాగో.

భార్య ఇంకా కదలకపోవటంచూసి, తూలుతూన్న శరీరంతో లేచివెళ్లి, పెట్టెలోని కరెన్సీనోట్ల కట్టల్ని తెచ్చి వదినగారి ఎదుట నిలబడి ఆమెకు అందిచ్చాడు. ఆమె అగమ్యగోచరంగా అతని ముఖంలోకి చూసింది. ఆమె ముఖంలోకి చూసే ధైర్యం అతనికి కలగలేదు. ముఖం వంచే మాట్లాడుదామని గట్టి ప్రయత్నంమీద నోరు తెరిచాడు. కాని ఆనోటివెంట మాటలు రాలేదు; నెత్తురు వచ్చింది; దాంతో అతని శక్తులన్నీ యీలోకంలోని పనుల్ని మానుకున్నయ్. అతని శీతల శరీరం నేల వ్రాలింది.

వదినగారికి మాత్రం—మరిది, సంధివల్ల మరణించాడనే ఇప్పటికీ నమ్మకం!

—నవంబరు, 1941